# 'నరేందర్‌రెడ్డి' నివాసానికి 'వద్దిరాజు'

## కేటీఆర్‌తో కలిసి వెళ్లి 'పట్నం' కుటుంబానికి భరోసా

ఖమ్మం, నవంబర్ 13: కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పోలీసులు అరెస్టు చేసిన నేపథ్యంలో హైదరాబాద్‌లోని ఆయన నివాసానికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కలిసి రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర వెళ్లారు. ఏమీ అధైర్య పడొద్దని, అండగా ఉంటానమని నరేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. హైదరాబాద్‌లోని కేబీఆర్ పార్కులో బుధవారం ఉదయం వాకింగ్ చేస్తున్న పట్నం నరేందర్‌రెడ్డిని మఫ్టీలో వచ్చిన పోలీసులు బలవంతంగా తీసుకెళ్లిన విషయం విదితమే. ఈ సందర్భంగా ఫిలింనగర్‌లోని పట్నం నివాసానికి వెళ్లిన కేటీఆర్, వద్దిరాజు.. ఆయన తల్లి రుక్కమ్మ, సతీమణి శృతి, కుటుంబ సభ్యులను కలిసి మాట్లాడారు. అక్రమ కేసులు, అరెస్టుల పట్ల భయపడొద్దని, పార్టీ కొండంత అండగా నిలుస్తుందని భరోసానిచ్చారు. వీరి వెంట మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, పొన్నాల లక్ష్మయ్య, మహమూద్ అలీ, జగదీశ్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు తదితరులు ఉన్నారు.

# 'పట్నం' అరెస్ట్ అప్రజాస్వామికం

## నరేందర్‌రెడ్డిని, రైతులను బేషరతుగా విడుదల చేయాలి: తాతా



ఎమ్మెల్సీ తాతా మధు

ఖమ్మం, నవంబర్ 13: కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని అరెస్ట్ చేయడం అప్రజాస్వామిక చర్య అని ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు అన్నారు. ఈ అరెస్టును తాను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఫార్మా కంపెనీల పేరుతో అమాయక గిరిజన బిడ్డల భూములను తన అల్లుడి కోసం లూటీ చేసేందుకు తెగబడ్డ సీఎం రేవంత్‌రెడ్డి అక్రమాలకు వ్యతిరేకంగా గళమెత్తినందునే పట్నం నరేందర్‌రెడ్డిపై ప్రభుత్వం కక్షగట్టిందని ధ్వజమెత్తారు. ఫార్మా ఇండస్ట్రీ కోసం చేపట్టిన భూసేకరణను వెంటనే నిలిపివేయాలని, అక్రమంగా అరెస్ట్ చేసిన నరేందర్‌రెడ్డిని, అమాయక రైతులను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కొడంగల్ ప్రాంత గిరిజన బిడ్డలపై రేవంత్ సర్కార్ చేస్తున్న దమనకాండను మేధావులు, ప్రజాస్వామిక వాదులు ఖండించాలని కోరారు.

# 'పట్నం' అరెస్టు సిగ్గుచేటు

## రైతులు దాడి చేస్తే మాజీ ఎమ్మెల్యేను అరెస్టు చేస్తారా: మాజీ ఎమ్మెల్యే మెచ్చా



అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

దమ్మపేట, నవంబర్ 13 : కొడంగల్‌లో రైతులు అధికారులపై దాడి చేస్తే.. మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని ఎందుకు అరెస్టు చేశారని, అకారణంగా ఆయనను అరెస్టు చేయడాన్ని అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. బుధవారం రాత్రి ఆయన ఇక్కడ మాట్లాడుతూ వాకింగ్ చేస్తున్న ఆయనను టెర్రరిస్టుల మాదిరిగా అరెస్టు చేస్తారా.. అని మండిపడ్డారు. ఓ పక్క రైతులను తీవ్రవాదులుగా చూస్తూ.. మరో పక్క ప్రజా సమస్యలపై పోరాడుతున్న బీఆర్‌ఎస్ ప్రజా ప్రతినిధులను జైళ్లకు పంపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి వైఖరి వల్లే ఈ వివాదం కొనసాగుతుందని, ఇంత జరుగుతున్నా ఇక్కడ సమస్యను గాలికొదిలేసి మహారాష్ట్రలో ఎన్నికల ప్రచారానికి ఎందుకు వెళ్లారంటూ ఆయన ప్రశ్నించారు. పట్నంను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



చేతితోనే తేమ శాతం నిర్ధారణ చేస్తున్న వ్యాపారులు (ఫైల్)

# చేత్తో చూసిందే తేమ.. నోటికొచ్చిందే ధర

మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మార్కెటింగ్ శాఖ అనేక నూతన పద్ధతులను అమల్లోకి తీసుకొస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం అవి అమలుకావడం లేదు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అన్నదాతలకు అందుబాటులోకి తీసుకొస్తే వారు మరింత ప్రయోజనం పొందే అవకాశం ఉందన్న ఉన్నతాధికారుల ఆలోచనలు అంతర్థానమైపోతున్నాయి. తద్వారా వ్యవసాయ మార్కెట్‌కు పంటను తీసుకొచ్చిన రైతులు.. వ్యాపారుల దయాదాక్షిణ్యాల మీదనే ఆధారపడాల్సి వస్తున్నది. అందుబాటులో ఉన్న అవకాశాలన్నింటినీ ఖరీదుదారులు సొమ్ము చేసుకుంటున్నారు. ఎండకు ఎండి వానకు తడిచి పంట పండించిన రైతులు మాత్రం నయవంచనకు గురవుతున్నారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో ఇలాంటి మోసాలు సర్వసాధారణమయ్యాయి. యంత్రాలను వినియోగించి పత్తి తేమ శాతాన్ని నిర్ధారించాల్సిన చోట కూడా అది అమలు కావడం లేదు. ఖరీదుదారులందరూ రైతులు తెచ్చిన పత్తిని చేతితో పట్టుకొని చూసి తేమ శాతాన్ని అంచనా వేస్తున్నారు. నోటికి వచ్చిన ధరను చెబుతున్నారు. అదే ఫైనల్ ధర అంటూ ఖరారు చేస్తున్నారు. పత్తి రైతులను నోరు మెదపనీయకుండా చేసి వారి నెత్తిన పెద్ద కుచ్చు టోపీ పెడుతున్నారు. ఇటీవలి ఖమ్మం కలెక్టర్ ఏఎంసీ పర్యటనలో ఈ దోపిడీ అంశం మరోసారి వెలుగులోకి వచ్చింది.

- తేమ నిర్ధారణ చేయరు.. మద్దతు ధర ఇవ్వరు
- మొత్తంగా కాటన్ రైతులకు కుచ్చుటోపీ పెడతారు..
- ఇదీ.. ఖమ్మం ఏఎంసీలో వ్యాపారుల తీరు
- పత్తిలో తేమ శాతం పరీక్షలకు ఖరీదుదారుల స్వస్తి
- ఖమ్మం కలెక్టర్ పరిశీలనలో చేదునిజం బహిర్గతం
- తీవ్రంగా నష్టపోతున్న దూదిపూల రైతులు
- అడ్తీ వ్యాపారుల నిర్లక్ష్యంపై అధికారుల నజర్



ఖమ్మం వ్యవసాయం, నవంబర్ 13: రాష్ట్రంలోని అతిపెద్ద వ్యవసాయ మార్కెట్లలో ఖమ్మం ఏఎంసీ ఒకటి. రైతులు, వ్యాపారులు, కార్మికుల సౌకర్యార్థం గత కేసీఆర్ ప్రభుత్వం ఈ మార్కెట్‌లోని అన్ని విభాగాల్లోనూ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. సీసీ టీవీలు, జీపీఆర్‌ఎస్ కాంటాలు, ఈ-నామ్, ఈ-టామ్ వంటి విధానాలను అమల్లోకి తెచ్చింది. అన్ని పంటల్లో తేమ శాతాన్ని నిర్ధారించేందుకు తేమ శాతం నిర్ధారణ యంత్రాలను కూడా అందుబాటులో ఉంచింది. వీటి ద్వారా పంటలను కొనుగోలు చేసి నాణ్యతా ప్రమాణాల ప్రకారం రైతులకు మద్దతు ధర చెల్లించాల్సిన వ్యాపారులు.. ఇటీవల కాలంగా తమ ధరలను చెబుతూ రైతులను నిలువునా ముంచుతున్నారు. గత్యంతరం లేని పరిస్థితిలో ఖరీదుదారులు చెప్పిన ధరకే అన్నదాతలు తమ రెక్కల కష్టాన్ని విక్రయించుకోవాల్సిన దుస్థితి నెలకొంది.



కలెక్టర్ ఆదేశాలకు అనుగుణంగా పత్తిలో తేమ శాతం పరీక్షలు చేస్తున్న ఖమ్మం ఏఎంసీ అధికారులు

### కలెక్టర్ పర్యటనలో చేదునిజాల బహిర్గతం

ఇటీవల ఖమ్మం ఏఎంసీలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పర్యటించిన సందర్భంగా తేమ శాతం పరీక్షల విషయంలో చేదు నిజాలు బహిర్గతమయ్యాయి. పత్తి యార్డులో కలియ తిరిగిన కలెక్టర్‌కు అనుమానం కలిగింది. దీంతో పంట లాట్ల వద్ద సిబ్బందితో తేమ శాతం పరీక్షలను చేయించారు. ఈ సందర్భంగా ఓ రైతు పంటలో కేవలం 9 శాతమే తేమ ఉన్నట్లు యంత్రంలో నమోదైంది. దీంతో సదరు రైతుతో కలెక్టర్ మాట్లాడారు. 'ఈ పంటకు వ్యాపారులు ఎంత ధర పెట్టారు?'అని అడిగారు. 'క్వింటాకు రూ.6,300 మాత్రమే పెట్టారు' అని సదరు రైతు సమాధానమిచ్చారు. దీంతో సంబంధిత అధికారులపై కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తేమ శాతం 8-12 ఉంటే మద్దతు ధర ఎందుకు చెల్లించడంలేదంటూ మందలించారు. అయితే రైతుల పంట నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నప్పటికీ ఖరీదుదారులు అమాయక రైతుల దగ్గర తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నట్లు వెల్లడైంది.

### కలెక్టర్ ఆదేశాలతో అధికారుల అప్రమత్తం

రైతులకు మద్దతు ధర కల్పించాలని, మోసం చేసే వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎంఏ అలీం, సెక్రటరీ ప్రవీణ్‌కుమార్‌లు బుధవారం పత్తి యార్డులో పర్యటించారు. పర్యవేక్షకులు, ఇతర సిబ్బందితో కలిసి స్వయంగా రైతుల వద్దకు వెళ్లి పంటను పరిశీలించారు. తేమ శాతం నిర్ధారణ పరీక్షలు చేసి వివరాలు నమోదు చేసుకున్నారు. తేమ శాతం తక్కువ ఉన్నప్పటికీ మద్దతు ధర రాని రైతులను గుర్తించారు. మద్దతు ధర ఇవ్వని కమీషన్ వ్యాపారులకు నోటీసులు జారీ చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు. రైతుకు మద్దతు ధర కల్పించి కమీషన్ తీసుకోవాల్సిన అడ్తీ వ్యాపారులు.. ఆ పని చేయకుండా కేవలం కమీషనే ధ్యేయంగా పనిచేస్తున్న వారి వివరాలను సేకరించారు.

### తక్కువ ధరకు బిడ్ అయిన లాట్లపై ప్రత్యేక శ్రద్ధ



పత్తి క్రయవిక్రయాలపై కలెక్టర్ ఆదేశాలకు అనుగుణంగా ప్రత్యేక చర్యలు చేపట్టాం. ముఖ్యంగా యార్డులో తక్కువ ధరకు కోట్ చేసిన లాట్లను గుర్తించి సదరు రైతుల వద్దకు వెళ్తున్నాం. పంటను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాం. నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ధర లభించని పక్షంలో తొలుత కమీషన్ వ్యాపారికి నోటీసులు జారీ చేస్తాం. ఇప్పటికే కొందరు కమీషన్ వ్యాపారులను గుర్తించాం. ఉద్దేశపూర్వకంగా పేచీ పెట్టి సొమ్ము చేసుకునే ఖరీదుదారులపై దృష్టి సారించాం.

–ప్రవీణ్‌కుమార్, ఖమ్మం ఏఎంసీ సెక్రటరీ

# ఆటో కార్మికుల బాధ్యత ప్రభుత్వానిదే..

## ఆటో అడ్డాను సందర్శించిన బీఆర్‌ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు



ఆటో కార్మికులతో మాట్లాడుతున్న రేగా కాంతారావు

మణుగూరు టౌన్, నవంబర్ 13 : ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో అన్ని విధాల నష్టపోయిన ఆటో కార్మికులను ఆదుకోవాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని బీఆర్‌ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు అన్నారు. మణుగూరు సురక్ష బస్టాండ్ ఆటో అడ్డాను బుధవారం సందర్శించిన ఆయన ఆటో కార్మికులతో కాసేపు మాట్లాడారు. వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రేగా మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ నాయకులు నోటికొచ్చిన హామీలు గుప్పించారని, వాటిని ఇప్పుడు అమలు చేయాలని ఆయా వర్గాలు ప్రశ్నిస్తే దాడులకు దిగడం.. కేసులు పెట్టడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. రోజూ ఆటో నడిపితేనే పూట గడిచే కార్మికులకు ప్రయాణికులు లేక పూట గడవక నానా అవస్థలు పడుతున్నారని, కనీసం వారిని ఆదుకోవాలనే ఆలోచన కూడా ప్రభుత్వం చేయడం లేదన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ఆటో కార్మికులకు అండగా ఉంటుందని, ఎవరూ అధైర్యపడొద్దని ఆయన ధైర్యం చెప్పారు. కేసీఆర్ నాయకత్వంలో మీకు తప్పకుండా న్యాయం జరుగుతుందని, మళ్లీ వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని ఆయన స్పష్టం చేశారు.

# గ్రూప్-3 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

## భద్రాద్రి అదనపు కలెక్టర్ వేణుగోపాల్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 13 (నమస్తే తెలంగాణ) : గ్రూప్-3 పరీక్ష నిర్వహణకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ ఆదేశించారు. ఐడీవోసీలోని సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో గ్రూప్-3 పరీక్ష నిర్వహణపై బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ నెల 17, 18 తేదీల్లో జరిగే పరీక్షల కోసం ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 13,845 మంది అభ్యర్థుల కోసం 39 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. పరీక్షల నిర్వహణకు 39 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 39 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, ఆరుగురు ఫ్లయింగ్ స్క్వాడ్, అభ్యర్థులను గుర్తించేందుకు 139 మంది అధికారులు, రూట్ ఆఫీసర్లు ఐదుగురు, అబ్జర్వర్లు 40 మందితో పాటు రాష్ట్రస్థాయి నుంచి అబ్జర్వర్లు విధులు నిర్వహిస్తారని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట భద్రతతోపాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, అన్ని కేంద్రాలను ముందస్తుగా పోలీస్ అధికారులు స్క్రీనింగ్ చేయాలని సూచించారు. కేంద్రాలకు ప్రహరీలు లేకుంటే అదనపు పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు. ప్రతీ కేంద్రం వద్ద బందోబస్తు ఏర్పాటుతోపాటు బయోమెట్రిక్ అటెండెన్స్ తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లను పరీక్ష సమయంలో మూసివేయించాలని పోలీసు అధికారులకు సూచించారు. అభ్యర్థులు అరగంట ముందే కేంద్రంలోకి రావాలని, ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు, సామగ్రిని పరీక్ష హాలులోని అనుమతించబోమన్నారు. సమావేశంలో ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, గ్రూప్-3 పరీక్షల నిర్వహణ కో ఆర్డినేటర్ హరికృష్ణ, జిల్లా అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు పాల్గొన్నారు.






# కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర


- దళారులకు పంట ఉత్పత్తులు అమ్మి మోసపోవద్దు
- ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన భద్రాద్రి ఎస్పీ రోహిత్ రాజు



ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ రోహిత్ రాజు

అన్నపురెడ్డిపల్లి, నవంబర్ 13 : రైతులు తాము పండించిన ధాన్యానికి మద్దతు ధర పొందాలంటే కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని, దళారులు, చిల్లర వ్యాపారులకు అమ్మి మోసపోవద్దని భద్రాద్రి ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. మండలంలోని గుంపెన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. కొనుగోళ్లకు సంబంధించి సొసైటీ సిబ్బందిని, రైతులను తమ సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. రైతుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కొనుగోలు కేంద్రాల వద్ద ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే పోలీస్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఎస్సైలు చంద్రశేఖర్, స్వప్న, ఎంపీడీవో మహాలక్ష్మి, ఏఈవో సంధ్యారాణి, సొసైటీ సీఈవో వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

# సర్వేను పరిశీలించిన సీఎంవో అధికారి



నగరంలో సర్వే విధానాన్ని పరిశీలిస్తున్న సీఎంవో అధికారి రవిచంద్ర

ఖమ్మం, నవంబర్ 13 : ఖమ్మం నగరంలో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే ప్రక్రియను ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన అధికారి రవిచంద్ర బుధవారం పరిశీలించారు. పలు ప్రాంతాల్లో పర్యటించిన ఆయన ఎన్యుమరేటర్లు సర్వే ఎలా చేస్తున్నారో అని స్వయంగా పరిశీలించారు. సర్వే సమయంలో ప్రజల నుంచి ఎలాంటి ధ్రువపత్రాలు తీసుకోవద్దని, ఎన్యుమరేటర్ సర్వేకు వెళ్లినప్పుడు కుటుంబ సభ్యులు అందుబాటులో లేకపోతే వారికి వీలున్న సమయంలోనే సర్వే చేయాలని సూచించారు. కుటుంబ సభ్యులకు ఎలాంటి అనుమానం వచ్చినా నివృత్తి చేయాలని, ఒకే ఇంట్లో ఎన్ని కుటుంబాలు ఉంటున్నా వారికి వేర్వేరు ఫారాలు కేటాయించి సర్వే చేయాలన్నారు. సర్వేతో ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ, అభివృద్ధి పథకాలు నిలిచిపోవని, అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించేందుకే సమగ్ర కుటుంబ సర్వే అని ఆయన పేర్కొన్నారు.

# 'ఇన్‌స్పైర్'కి 119 ప్రాజెక్టులు

- ఈ నెల 26, 27 తేదీల్లో నిర్వహణకు ప్రతిపాదనలు
- సన్నాహక సమావేశం నిర్వహించిన ఖమ్మం డీఈవో



'సైన్స్‌ఫెయిర్' సమావేశంలో పాల్గొన్న అధికారులు

ఖమ్మం ఎడ్యుకేషన్, నవంబర్ 13: ఖమ్మం జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలో 6 నుంచి 10 తరగతుల విద్యార్థులు ఇన్‌స్పైర్ కోసం తమ ప్రాజెక్టులు నమోదు చేసుకోగా వాటిల్లో 119 ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. ఇలా ఎంపికైన ఒక్కో ప్రాజెక్టుకు రూ.10 వేల చొప్పున పారితోషికాన్ని ప్రభుత్వం అందజేస్తుంది. ఈ నగదుతో విద్యార్థులు ప్రాజెక్టును తయారుచేసి ప్రదర్శించాల్సి ఉంటుంది. 119 ప్రాజెక్టుల్లో 111 ప్రాజెక్టులు ప్రభుత్వ పాఠశాలలవే. కేవలం 8 మాత్రమే ప్రైవేట్ పాఠశాలలవి.

### 26, 27 తేదీల్లో నిర్వహణకు ప్రతిపాదనలు..

'ఇన్‌స్పైర్ మానక్', 'సైన్స్‌ఫెయిర్' ప్రదర్శనలను ఈ నెల 26, 27 తేదీల్లో నిర్వహించేలా అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. నగరంలోని పాత డీఈవో కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. సైన్స్‌ఫెయిర్‌లో నమోదుకు ఈ నెల 16 వరకు గడువు ఇచ్చారు. విద్యార్థులను యాజమాన్యాలు ప్రోత్సహించాలని కోరారు. జిల్లా స్థాయి ప్రదర్శనలు నిర్వహించేందుకు విద్యార్థుల ప్రాజెక్టుల నమోదు సంఖ్య ఆధారంగా కలెక్టర్‌కు నివేదించనున్నారు. కమిటీల రూపకల్పన, ఇతర నిర్వహణ అంశాల్లో సహకరించాలని ఉపాధ్యాయ సంఘాల బాధ్యులను డీఈవో సోమశేఖరశర్మ కోరారు.



సైన్స్‌ఫెయిర్ ప్రదర్శనల్లో పాల్గొన్న విద్యార్థులు (ఫైల్)

### థర్మాకోల్ నిషేధం..

సైన్స్‌ఫెయిర్ ప్రదర్శనల్లో విద్యార్థులు థర్మాకోల్ అట్టలను, డ్రాయింగ్ షీట్లను, ఫ్లెక్సీలను ప్రదర్శించరాదని డీఈవో స్పష్టం చేశారు. వీటితో తయారుచేసే ప్రాజెక్టులను పూర్తిగా నిషేధిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘాల నాయకులు, ఎంఈవోలు, సైన్స్ అధికారి, ప్రైవేట్ స్కూళ్ల బాధ్యులు పాల్గొన్నారు.

# ఆదాయ వనరుగా ఇసుక ర్యాంపులు

## ట్రైకార్ జీఎం శంకర్‌రావు



గిరిజనులతో మాట్లాడుతున్న ట్రైకార్ జీఎం శంకర్‌రావు

దుమ్ముగూడెం, నవంబర్ 13 : ఆర్థిక వనరుల కోసం గిరిజన మహిళలు ఇసుక ర్యాంపుల ద్వారా జీవనోపాధి పొందాలని ట్రైకార్ జీఎం శంకర్‌రావు అన్నారు. నందులచెలకలోని ఇసుక ర్యాంపును మైనింగ్ శాఖ అధికారులతో కలిసి బుధవారం ఆయన స్వయంగా పరిశీలించారు. అక్కడి గిరిజనులతో మాట్లాడి ఇసుక ర్యాంపుల నిర్వహణలో ఎదుర్కొంటున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ర్యాంపులు నిర్వహించే మహిళలు ఆ గ్రామానికి చెందిన వారై ఉండాలని, బినామీలను దరిచేరనీయవద్దని సూచించారు. ఇసుక సరఫరా వివరాలను ఎప్పటికప్పుడు రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. ర్యాంపుల నిర్వహణతో గిరిజన మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఐటీడీఏ పరిపాలనాధికారి రాంబాబు, డీఏస్‌వో ప్రభాకర్‌రావు, జీఎం ఎల్లయ్య, టీఎస్‌ఎండీసీ పీఎంవో శంకర్, గిరిజన మహిళలు పాల్గొన్నారు.


మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ

నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు

సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు

సెల్ : 9182777616